



స్మార్ట్‌సిటీ పనుల్లో భారీగా అవినీతి

- విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం
- సీఎం హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం
- పారదర్శక పాలనతో ప్రజలకు విశ్వాసం కల్పిస్తాం
- ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలపై చర్యలు
- ఇకపై వారానికొక విభాగంపై కలెక్టర్ సమీక్షిస్తారు
- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ టౌన్, జూన్ 18: 'కరీంనగర్‌లో చేపట్టిన స్మార్ట్‌సిటీ పనుల్లో భారీగా అవినీతి జరిగిందని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ చౌక్‌లోని ఇందిరాచౌక్ సుందరీకరణకు కోటి 30 లక్షల బిల్లు ఉంటే అదనంగా 50 లక్షల ఖర్చు అయినట్లు చెబుతున్నారని.. జంక్షన్ల సుందరీకరణ, ఇతర అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతిపై విజిలెన్సు విచారణ జరుగుతోందన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ను కూడా విచారణకు ఆదేశించామని, విచారణ తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ సమావేశమందిరంలో కరీంనగర్ నగరపాలక సంస్థ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నగర పాలక సంస్థకు గత ప్రభుత్వం 132 కోట్ల సీఎం హామీ నిధులు మంజూరు చేసిందన్నారు. ఇంజనీరింగ్ అధికారులు చేపట్టిన 80 పనులు జరుగగా, ఇంకా కొన్ని పనులు ప్రారంభం కానివి ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులపై ఈఈ స్థాయి అధికారి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించి నట్లు తెలిపారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరంలో 22 వైఫై హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేశారని, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసర ముందని అన్నారు. టెక్నాలజీ కంపోనెంట్ కింద 98 కోట్లతో కమాండ్ కంట్రోల్ నుంచి 700 సీసీ కెమెరాలు, ఆడియో, సౌండ్ సిస్టమ్, టెలివిజన్ ప్రజెంటేషన్, సెన్సిటివ్ ప్రాంతాల్లో అలారం లాంటి ఏర్పాటు కోసం కేటాయించారని, వాటి ద్వారా ప్రజలు భవిష్యత్‌లో ప్రయోజనం పొందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ అధి కారంలో వచ్చిన తర్వాత పేదల భూమిని ఆక్రమించి ఉంటే స్వేచ్ఛగా ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పామన్నారు. ఈరోజు చాలా మందిపై చర్యలు తీసుకోవడంతో సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఈ విషయంలో రాజకీయ జోక్యం ఉండ కుండా వాతావరణం కల్పించామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని అధికార దుర్వినియోగంతో అనుమతి తీసుకుని అక్రమంగా నిర్మించిన భవనాల వివరాలను తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామని చెప్పారు. ప్రజలు అలాంటి వాటి వివరాలను అధికారులకు తెలిపి ప్రభుత్వ స్థలాలు కాపాడుకోవాలని మంత్రి ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేసినట్లు ఆధారాలు లభిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

● అనుమతిలేని నిర్మాణాలపై సమగ్ర విచారణ

అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాలపై సమగ్ర విచారణ చేయాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. శానిటేషన్‌లో వెహికిల్ మేనేజిమెంట్ సిస్టమ్ తదితర అంశాలపై చర్చించామని అన్నారు. కలెక్టర్ వచ్చే వారం నుంచి నగరపాలక సంస్థలోని ఒక్కో విభాగంపై సమీక్ష జరిపి లోటుపాట్లను గుర్తించాలని చెప్పామన్నారు. నగ రంలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లు వాటికి సంబంధించిన ఎంబీ రికార్డు చేసిన వారికి వరు 'సక్రమంలో బిల్లులు చెల్లించాలని, ముందు పనులు పూర్తిచేసిన వారికి బిల్లులు ఇచ్చిన తర్వాతే క్రమ' పద్ధతిలో బిల్లులు ఇవ్వాలని ఆదేశించామన్నారు. టాస్క్ ఫోర్స్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని మున్సిపల్‌కి సంబం ధించిన ప్రజల గ్రీవెన్స్, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ మున్సిపల్ సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఆదేశిం చామని అన్నారు. నగరంలో తాగునీటి అంశంపై అధికా రుల తో చర్చించామని చెప్పారు. 1,700 మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశారని, నగరంలో మహిళాశక్తిని బలోపేతం చేస్తామని మంత్రి పొన్నం తెలిపారు.

● త్వరలోనే మానేరు రివర్ ఫ్రంట్ పనులు పూర్తి

మానేరు రివర్ ఫ్రంట్ ఫేజ్-1లో 72శాతం పనులు పూర్తయ్యాయని, ఫేజ్-2లో డ్రైనేజీ సిస్టమ్‌ను చేర్చామని, వర్షాలు పడకముందే ఆ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించామని చెప్పారు. టూరిజం ప్రాజెక్టు కింద గత ప్రభుత్వం 100 కోట్లు నిధులు కేటాయించి 30 కోట్లు మంజూరు చేసిందని, అందులో ఐదు కోట్లు మాత్రమే ఖర్చయ్యాయని అధికారులు నివేదిక ఇచ్చారని మంత్రి తెలిపారు. త్వరగా ప్రాజెక్టు పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో నగరంలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా సిగ్నల్ లెస్ జంక్షన్లను రూపొందించగా 30 చోట్ల సిగ్నల్స్ ఏర్పాటు చేశారన్నారు. అందులో ఆరు ప్రాంతాల్లో మాత్రమే అవి పనిచేస్తున్నాయని అన్నారు. ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థపై పునఃసమీక్ష చేస్తామని చెప్పారు. నగరంలో ఎలాంటి తప్పులు జరిగినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెద్దమొత్తంలో బకాయిలున్న బడా వ్యక్తుల నుంచి, సంస్థల నుంచి రావల్సిన పన్ను లను వసూలు చేయాలని అధికారులకు సూచిం చామన్నారు. నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి కొందరు విధులు నిర్వహిస్తున్నారని, అలాంటి వారి వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బదిలీలు చేపడతామని చెప్పారు. ప్రభు త్వాలు మారగానే పద్ధతులు మారవని, నగర అభివృద్ధికి గతంలో కన్నా ఎక్కువ నిధులు తీసుకువస్తామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కేబుల్ బ్రిడ్జి ఎందకు వచ్చిందో... ఎన్ని వాహనాలు ఆ బ్రిడ్జి నుంచి వెళ్తున్నాయో, ఆ పను ల్లో నాణ్యత ఎలా ఉందో అందరికీ తెలుసని, వాటిపై తర్వాత చర్చిస్తామని మంత్రి తెలిపారు.

● ఎమ్మెల్యే, మేయర్ గైర్హాజరు

రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి నిర్వహించిన నగరపాలక సంస్థ సమీక్షకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లస్వరూపరాణి హరిశంకర్ హాజరు కాలేదు.. ఈ సమావేశానికి వారు హాజరుకాక పోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వారికి ఆహ్వాన అందించలేదా లేక ఎందుకు రాలేదని చర్చించుకున్నారు.



హాజరైన అధికారులు



నిరసన వ్యక్తం చేస్తున్న దళితబంధు సాధన సమితి సభ్యులు


రెండో విడత దళితబంధు మంజూరు చేయాలి

హుజూరాబాద్, జూన్ 18: దళితబంధు లబ్ధిదారులకు రెండో విడత డబ్బులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా దళితబంధు పథకాన్ని మాజీ సీఎం కేసీఆర్ ప్రారంభించారన్నారు. నియోజకవర్గంలో 17,862మంది లబ్ధిదారులను గుర్తించి మొదటి విడతగా ఐదు లక్షల రూపాయలు విడుదల చేశారన్నారు. రెండో విడత విడుదల చేసే సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయాయన్నారు. ఎన్నికలు అయిపోయాక ఇస్తామని ఇరు పార్టీలు హామీలు ఇచ్చి, ఎన్నికలు ముగిసిన తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే లబ్ధిదారులకు రెండో విడత దళితబంధు డబ్బులు మంజూరు చేయాలని కోరారు.

అధికారులపై ఆగ్రహం

- సమగ్ర సమాచారంతో మంత్రి సమీక్ష
- ఒక్కో అంశంపై ఉద్యోగుల నిలదీత

కరీంనగర్ టౌన్, జూన్ 18: రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నగరపాలక సంస్థ అధికారులకు ముచ్చెమటలు పట్టించారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి నగరపాలక సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు వెయ్యి కోట్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సీఎం హామీ నిధులు, ఇతరత్రా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటిలో నాణ్యతా ప్రమాణాలు, బిల్లుల చెల్లింపులు, వాటిపై వచ్చిన ఫిర్యాదులపై ఒక్కొక్కటిగా ఆరా తీస్తూ వాటి వివరాలను తెలుపాలని సంబంధిత ఉద్యోగులను, అధికారులను నిలదీశారు. నాణ్యతాలోపాలు ఎక్కడెక్కడ జరిగాయి... ఒకే పనికి రెండు బిల్లులు ఎలా చెల్లించారు... అంచనా కంటే ఎక్కువ ఎందుకు ఖర్చు చేశారు... వాటికి సంబంధించిన అనుమతులు ముందస్తు తీసుకున్నారా... నిబంధనలకు విరుద్ధంగా ఎలా పనులు చేశారు... వాటి బిల్లులు ఎలా ఇచ్చారంటూ మంత్రి అసహనం వ్యక్తం చేశారు. విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఆయన ఇన్‌చార్జీ డీసీపీ, టీపీవో, ఇతర అధికారులు, ఉద్యోగులను ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లకు ఎలా అనుమతులు ఇచ్చారని, అనుమతి లేకుండా ఇళ్లు నిర్మించుకొని బల్దియా ఖజానాకు గండి పెడుతుంటే ఏమి చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన భవనాల వివరాలను ఇవ్వాలని, వాటిపై ఆధారాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేని అక్రమ కట్టడాలపై కూడా దృష్టిపెట్టి వాటి వివరాలను కూడా ఇవ్వాలని ఆదేశించారు. రోజురోజుకు నగరపాలక సంస్థలో ఖర్చులు పెరుగుతున్నాయని, రాబడి తగ్గుతోందని, ఇందుకు కారణాలు చెప్పాలని రెవెన్యూ అధికారులను నిలదీశారు. తన ఇంటికి పన్ను నిర్ధారించినట్లుగా ప్రైవేట్ విద్యాసంస్థలకు ఎందుకు సరిగా పన్నులు వేసి వసూలు చేయడం లేదని, నగరంలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థకు సంబంధించిన భవనానికి ఎంత పన్ను వేశారో చెప్పాలని, వారి వద్ద నుంచి ఎంత తీసుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఏమి చేస్తున్నారో ఎక్కడెక్కడ డబ్బులు తీసుకుంటున్నారనే సమాచారం తనవద్ద ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విధులునిర్వహిస్తే చర్యలు తప్పవని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. బల్దియాలోని ముఖ్య విభాగాల్లో అంతర్గత బదిలీలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఇలాంటి అంశాలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానం అమలులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాదాపు మూడు గంటలపాటు సుదీర్ఘంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో చర్చించడంతో ఇతరశాఖల అధికారులు కూడా జాగ్రత్త పడ్డారు. బల్దియా సమీక్ష తర్వాత ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణపై సమీక్ష నిర్వహించాల్సిన మంత్రి పొన్నం దానిని రద్దు చేసుకున్నారు. మరోసారి ఆ సమావేశాన్ని కులంకషంగా నిర్వహిస్తామని ప్రకటించారు.



నేడు కేంద్ర మంత్రి బండి సంజయ్ రాక

● శనిగరం వద్ద ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

భగత్‌నగర్, జూన్ 18: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బుధవారం కరీంనగర్‌కు రానున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి కరీంనగర్‌కు రానుండడంతో ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. బుధవారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని శనిగరం వద్ద ఘన స్వాగతం పలకనున్నారు. అనంతరం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం, చైతన్యపురిలోని తన తల్లి ఆశీస్సులు తీసుకుని కొండగట్టు వెళ్లనున్నారు. చొప్పదండి నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలతో భేటీ అనంతరం నలగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్నిదర్శించుకో నున్నారు. సాయంత్రం 4 గంటలకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనం అనంతరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించనున్నారు. 7 గంటలకు సిరిసిల్ల కేంద్రంలోని మార్కండేయ దేవాలయాన్ని దర్శిం చుకుని పూజలునిర్వహించనున్నారు. అక్కడే సిరిసిల్ల నియోజకవర్గ నాయకులను కలుసుకుంటారు..

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడవద్దు




ఇల్లందకుంటలో మాట్లాడుతున్న డీఆర్డీవో పీడీ శ్రీధర్

ఇల్లందకుంట, జూన్ 18: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో అధికారులు అవకతవకలకు పాల్పడవద్దని డీఆర్డీవో పీడీ శ్రీధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పావని అధ్యక్షతన ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్డీవో పీడీ శ్రీధర్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు చెరువులోని మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకెళ్తున్నారని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో సంధ్యారాణి, అంబుడ్స్‌మెన్ లక్ష్మీనారాయణ, విజిలెన్స్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సార్పీ పాండురంగ, ఎంపీడీవో పుల్లయ్య, ఏపీవో రవికుమార్ పాల్గొన్నారు.


అందుబాటులో ఆల్బెండజోల్ మాత్రలు

సుభాష్‌నగర్, జూన్ 18: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సుగల వారందరికి వేసేందుకు ఆల్బెండజోల్ మాత్రలు అందుబాటులో ఉన్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1 నుంచి 19 వయస్సుగల వారు 3,47,523 మంది ఉన్నారని, 3,48,900 మాత్రలు ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈనెల 20న దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రను అందజేయాలని సూచించారు. 20వ తేదీన మాత్ర తీసుకోని వారికి ఈనెల 27న ఇవ్వాలని సూచించారు.



















రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


వినోద్ కుమార్ (ఫైల్)

ఓదెల, జూన్ 18: భార్య బంధువుల వేధింపులతో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఓదెల మండలం కొలనూరులో వెలుగు చూసింది. మండలంలోని కొలనూర్ రైల్వే గేట్ సమీపంలో సోమవారం రాత్రి ఇదే గ్రామానికి చెందిన దున్నపోతుల వినోద్ కుమార్ (32) అనే యువకుడు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి స్వరూప రామగుండం జీఆర్‌పి హెడ్ కానిస్టేబుల్‌కు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వినోద్ కుమార్ భార్య వసంత బంధువులైన అమ్మమ్మ మాడక ఎంకమ్మ, నానమ్మ బొంతల కనకమ్మలు మానసికంగా వేధించడం వల్లనే నా కొడుకు ఆత్మహత్యకు పాల్ప డ్డాడని పేర్కొన్నారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, విచారణకు సహకరించకుంటే పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు కేసును అప్పగించ నున్నట్లు రామగుండం జీ.ఆర్.పి. హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. కరీంనగర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దున్నపోతుల రాజయ్యకు ఏకైక కుమారుడైన వినోద్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంతో పాటు, కుటుంబంలో విషాధం నెలకొంది.

వృద్ధురాలి అదృశ్యం


ఎల్లారెడ్డిపేట, జూన్ 18: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు ఎనగందుల భూదవ్వ అదృశ్యంపై కేసు నమోదు చేశామని పోలీసులు మంగళవారం తెలిపారు. గ్రామంలోని వృద్ధురాలు భూదవ్వ ఈ నెల 17న మధ్యాహ్నం ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళుతానని చెప్పి బయటకు పోయింది. అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి ఫోన్ చేసి విషయం తెలుసుకున్నారు. తమ వద్దకు రాలేదని స్పష్టం చేయడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, చుట్టు పక్కల ఆరా తీశారు. ఆచూకీ లభించ లేదు. దాంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.


విద్యుదాఘాతంతో గేదెల మృతి

జమ్మికుంట రూరల్, జూన్ 18: జమ్మికుంట మండలం తనుగుల గ్రామ శివారులో మంగళవారం విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. మూల ప్రభాకర్, పైడిపల్లి సంపత్‌లకు చెందిన రెండు గేదెలు తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాయి.
















మహిళకు పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందికి మంత్రి పొన్నం అభినందన


ఆర్టీసీ సిబ్బందిని అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భగత్‌నగర్, జూన్ 18: కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఆదివారం గర్భిణికి పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందిని మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన గర్భిణి కుమారి తన భర్త జాలతో కలిసి ఆదివారం కుంట (భద్రాచలం) వెళ్లేందుకు ఆదివారం కరీంనగర్ బస్‌స్టేషన్‌కు వచ్చింది. కొద్దిసేపటికే కుమారికి పురిటి నొప్పులు రావడంతో ఆర్టీసీ సిబ్బంది సాయం కోరగా వెంటనే 108 సిబ్బందికి ఫోన్ చేశారు. పురిటి నొప్పులు ఎక్కువ కావటంతో ఆర్టీసీ మహిళా సిబ్బంది ప్లాట్‌ఫాం ఎదురుగా ఉన్న చెట్టు కిందకు కుమారిని తీసుకు వెళ్లి చుట్టూ చీరలు కట్టి డెలివరీ చేశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వగా 108 సిబ్బంది తల్లీబిడ్డను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు.

●పురిటి నొప్పులతో ఉన్న మహిళకు డెలివరీ చేసిన ఆర్టీసీ సిబ్బందిని మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. మహిళకు పురుడు పోసిన ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సైదమ్మ, రేణుక, భవాని, లావణ్య, స్టేషన్ మేనేజర్ అంజయ్యలను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌లు 5వేల నగదు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్, రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటి రీజినల్ మేనేజర్లు భూపతిరెడ్డి, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మారుతీ.. వసతి ఏదీ..

● వేలాదిగా భక్తులు.. పదుల సంఖ్యలో అద్దె గదులు
● ఇబ్బందులు పడుతున్న భక్తులు
● కొండగట్టులో వెక్కిరిస్తున్న అసౌకర్యాలు

మల్యాల, జూన్ 18: ఉత్తర తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానంలో సౌకర్యాల లేమి భక్తులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. భక్తులు, దుకాణాల ద్వారా దేవస్థానానికి ఏటా సుమారు రూ.20కోట్ల వరకు ఆదాయం సమకూరుతున్నప్పటికీ కొండపైన కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారులు, దేవస్థానం అభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. కొండపై ముఖ్యంగా వసతి సౌకర్యం లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొండగట్టుకు నిత్యం వేలాదిగా, శని, ఆది, మంగళవారాల్లో వేలాదిగా భక్తులు తరలివస్తూంటారు. అయితే కొండపై గదులు లేమి ఇబ్బంది మారింది.

● వేలల్లో భక్తులు.. పదుల్లో గదులు

కొండగట్టు అంజన్న దర్శనానికి నిత్యం వేలాదిగా భక్తులు వస్తున్నారు. ఇక ప్రతి మంగళ, శని, ఆదివారాల్లో దాదాపుగా ముప్పై వేల వరకు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకు గాను ముందు రోజే వేలాదిగా భక్తులు చేరుకుంటుండగా కొండపై వసతి లేకపోవడంతో ఆరుబయటే ఆలయ ఆవరణ తదితర చోట్ల చలిలో బసచేయాల్సిన పరిస్థితి నెలకొంది. వేలాదిగా వచ్చే భక్తుల కోసం కేవలం 47 వరకు మాత్రమే గదులు అందుబాటులో ఉండగా ఇందులో కొన్ని వ్యాపారుల ఆధీనంలో ఉండడంతో భక్తులకు వసతి లేమి తీవ్ర అసౌకర్యంగా మారింది. అంజనాద్రిలో 16, మారుతీ నిలయంలో 14, బుగ్గమఠం, సాగర్, శ్వేత కాటేజీలలో రెండు చొప్పున రూ.100 గదులు 7 ఉండగా వాటినే భక్తులకు ఇస్తున్నారు. కొండగట్టులో గదులు ఉండవనే ప్రచారం వేలాది మంది భక్తులు కొండగట్టుకు నేరుగా వచ్చి దర్శనం చేసుకొని వెలుతున్నారు. గదులు భక్తులకు తగిన రీతిలో ఉంటే వేలాదిగా వచ్చి స్వామి వారి మొక్కులు తీర్చుకునే అవకాశం ఉంది. గదులు లేకపోవడంతో సగం మొక్కుల చెల్లింపునకే పరిమితం అవుతున్నట్లు భక్తులు ఆవేదన చెందుతున్నారు.


కొండపైన గల ధర్మసత్రాలు


గదులు లేక బటయ పడుకున్న అంజన్న భక్తులు

● అధికారుల దృష్టికి తీసుకెళ్లాం - చంద్రశేఖర్, ఈవో

గదుల సంఖ్య తక్కువగా ఉండడంతో భక్తులకు అసౌకర్యం ఏర్పడుతోంది. 500గదుల నిర్మాణం కోసం ప్రయత్నిస్తున్నాం. గదుల లేమి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దాతలు కూడా గదుల నిర్మాణాలకు విరాళాలు అందించవచ్చు. భక్తులకు ఎలాంటి ఇక్కట్లు కలుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ పర్యవేక్షిస్తున్నాం. భక్తులకు సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జూన్ 18: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకున్నారు. అంజన్న దర్శనం భక్తులు అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో చంద్రశేఖర్, అధికారులు పర్యవేక్షించారు.

● అంజన్నను దర్శించుకున్న పోలీస్ అధికారులు

కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం కరీంనగర్ ఇంటిలిజెన్స్ ఎస్పీ రాజమహేంద్ర నాయక్, జగిత్యాల అడిషనల్ ఎస్పీ వినోద్ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈవో చంద్రశేఖర్‌తో పాటు పోలీస్ అవుట్‌పోస్ట్ ఏఎస్సై చిలుక శ్రీనివాస్ ఉన్నారు

● నేడు బండి సంజయ్ రాక

కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పదవీ బాధ్యతలు చేపట్టాక బుధవారం మొదటి సారి కొండగట్టుకు వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తన గెలుపు కోసం అంజన్న సన్నిధిలో ముడుపు కట్టగా స్వామి వారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటారని బీజేపీ నాయకులు తెలిపారు.

లారీ లోంచి జారిపడ్డ రాయి.. తప్పిన ప్రమాదం

శంకరపట్నం, జూన్ 18: శంకరపట్నం మండలం మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద కరీంనగర్-వరంగల్ రహదారిపై ఓ గ్రానైట్ లారీ నుంచి బండరాయి జారి కింద పడింది. కొత్తగట్టు గ్రానైట్ క్వారీ నుంచి లారీలో గ్రానైట్ బండరాయిని కరీంనగర్ వైపుకు తీసుకెళ్తున్నారు. మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్దకు రాగానే లారీ టైర్లు రోడ్డు కిందకు దిగాయి. నేల కుంగడంతో టైర్లు కొంత భాగం భూమిలోకి వెళ్లాయి. లారీ అటువైపు వంగడంతో బండరాయి జారి కింద పడింది. ఈ బండరాయి రోడ్డు పక్కన ఉన్న షాపు సమీపంలో పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. లారీలో బండరాయి తరలించడానికి జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతోనే జారి కింద పడిందన్నారు. గ్రానైట్ వాహనదారులు కనీస జాగ్రత్తలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొంటున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.


కొత్తగట్టులో లారీలోంచి కింద పడ్డ గ్రానైట్ రాయి

పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో రైతులకు మేలు

● కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న

జమ్మికుంట, జూన్ 18: ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు పెట్టుబడుల కోసం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రైతులకు ఎంతగానో మేలు చేస్తుందని కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)లో భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడి వారణాసిలో పీఎం కిసాన్ నిధి పథకం కింద 17వ విడుత నిధుల విడుదల ప్రారంభ కార్యక్రమాన్ని ప్రత్యేక్షంగా వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యతిధులుగా కేంద్ర మంత్రి, వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ జోన్ అధికారి డాక్టర్ షేక్ ఎన్ మీరా, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి సోమన్న మాటాడుతూ పంట పెట్టుబడి సాయం కింద దేశంలోని రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ పథకాన్ని 2019 ఫిబ్రవరిలో ఉత్తర్‌ప్రదేశ్ గోరఖ్‌పూర్‌లో ప్రధాన మంత్రి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా మూడు విడుతల్లో రెండు వేల చొప్పున రూ.6వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. 17వ విడుతలతో భాగంగా తొమ్మిది కోట్ల 26లక్షల మంది రైతుల ఖాతాల్లో ఇరువై వేల కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ పద్ధతుల్లో తోటి రైతులకు సహకరించడానికి పారా-ఎక్స్‌టెన్షన్ వర్కర్లుగా పని చేయడానికి కృషి సఖిలుగా శిక్షణ పొందిన 30వేల మందికి పైగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రధాన మంత్రి మోదీ సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ జోన్ అధికారి డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ ప్రపంచం, దేశంలో అత్యధికంగా 80శాతం చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని, వారికి ఆర్థికంగా చేయూతను అందించేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. వ్యవసాయంలో అగ్రి డ్రోన్ల మీద 85శాతం సబ్సిడీ ఇస్తున్నారని, అందులో మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ శిక్షణ ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను రైతులు పెట్టుబడిగా ఉపయోగించుకోవాలన్నారు. ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ద్వారా తగిన శాస్త్రీయత సాంకేతిక సలహాలు పొందుతూ వ్యవసాయ రంగంలో రాణించాలని కోరారు. కెవికె ప్రధాన కార్యదర్శి పరిపాటి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను రక్షించేందుకు, వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు రైతు బీమాను కల్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. ప్రస్తుతం వ్యవసాయంలో రైతులు నేల ఆరోగ్యంపై అధికంగా దృష్టి పెట్టాలని, నేల ఆరోగ్యమే మానవ మనుగడకు అవసరమని తెలిపారు. కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని 29లక్షల 50వేల మంది రైతులకు రూ.590కోట్ల లబ్ధి చేకూరనుందని తెలిపారు. ఈ ఆర్థిక సహాయం ద్వారా వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకోవడానికి, ఆదాయం పెంచుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, హుజూరాబాద్ ఆర్డీవో, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, కెవికె సిబ్బంది, ఆదర్శ రైతులు, వ్యవసాయ, అనుబంధ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి సోమన్న

● కౌశిక్‌రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్న బీజేపి నాయకులు

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమాకి హాజరైన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతుండగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన రైతుబంధు, రైతు బీమా, 24గంటల కరెంట్, కాళేశ్వరం ప్రాజెక్ట్, తదితర అంశాల ప్రస్తావన తీసుకువచ్చారు. జరుగుతున్న కార్యక్రమం గురించి మాట్లాడకుండా ఇతర అంశాల మీద మాట్లాడటంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ప్రసంగాన్ని అడ్డుకున్నారు. కౌశిక్‌రెడ్డి సైతం వారి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్వయంగా కేంద్ర మంత్రి స్పందించి బీజేపీ నాయకులకు నచ్చచెప్పే ప్రయత్నం చేయగా, వారు శాంతించడంతో గొడవ సద్దుమనిగింది.



సివిల్స్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూన్18: ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ ,ఎస్టీ,ఈబీసీ అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 19 నుంచి జూలై3 వరకు వెబ్‌సైట్"www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తరగతులు జూలై18, 2024 నుంచి 2025, జూలై18 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనుండగా, అందులో 100 మందికి గాను జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. మరో 50 మంది అభ్యర్థులను ఇంతకుముందు యూపీఎస్సీ ద్వారా నిర్వహించిన సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్)లో ఉత్తీర్ణత సాధించిన వారిని నేరుగా తీసుకుంటారని పేర్కొన్నారు. వారు సంబంధిత పత్రాలతో జూలై3లోగా బీసీ స్టడీ సర్కిల్ లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో దరఖాస్తును సమర్పించాలని సూచించారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, భోజన, రవాణా కోసం నెలకు రూ.5వేలు ఇస్తారన్నారు. గ్రంథాలయ సదుపాయం కూడా కల్పించినట్లు తెలిపారు. ఈ ఉచిత శిక్షణ హైదరాబాద్‌లో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



ధర్మపురిలో ఘనంగా మహాలక్ష్మీ నృసింహ మహాయజ్ఞం

ధర్మపురి, జూన్ 18: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అష్టోత్తరశత మహాలక్ష్మీ నృసింహ మహాయజ్ఞం మంగళవారం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీ నరసింహ స్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరంలాగే లోక కల్యాణార్థం, సమస్త విశ్వశాంతి కోసం హైదరాబాద్‌కు చెందిన శ్రీమాన్ భాగవతుల వంశీకృష్ణమాచార్య స్వామి ఆధ్వర్యంలో ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. నరసింహ స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ ఉగ్ర నారసింహ స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు యజ్ఞంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీనియర్ అసిస్టెంట్ అలు వాల శ్రీనివాస్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ సిబ్బంది ఉన్నారు.


మహాయజ్ఞం నిర్వహిస్తున్న అర్చకులు

మాల్దీవ్స్‌లో నారాయణపూర్ వాసి మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 18: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన శీతల చంద్రయ్య మాల్దీవ్స్‌లో ప్రమాదవశాత్తు ఈ నెల 17న మృతి చెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు మంగళవారం పేర్కొన్నారు. ఆయన మరణ వార్త తెలియడంతో కుటుంబంతో పాటు స్వగ్రామంలో విషాదం నెలకొంది. నెల రోజుల కిందట చంద్రయ్య సోదరుడు నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో మాల్దీవ్స్ నుంచి అంత్యక్రియలకు ఆయన స్వస్థలానికి చేరుకున్నాడు. 15 రోజుల పాటు ఇక్కడే ఉన్న చంద్రయ్య తిరిగి పయనమయ్యాడు. నెల రోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా రోధిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని చంద్రయ్య ఉన్న ఊరిలో ఉపాధి లేక గత 20 ఏళ్లుగా ముంబాయికి వలస వెళ్లాడు. అక్కడ అఫ్గాన్ కంపెనీలో పనులు చేస్తు జీవిస్తుండేవాడు. ఈ క్రమంలో అదే కంపెనీ మాల్దీవ్స్ దేశంలో వంతెన నిర్మాణ పనులను చేపడుతోంది. దాంతో రెండేళ్ల కిందట చంద్రయ్య మాల్దీవ్స్‌కు వెళ్లాడు. నెల రోజుల కిందట అతని సోదరుడు నర్సయ్య అనారోగ్యంతో చనిపోయాడు. స్వగ్రామానికి వచ్చిన చంద్రయ్య అంత్యక్రియలు నిర్వహించి 15 రోజుల పాటు ఉండి తిరిగి పయనమయ్యాడు. ఈ నెల 17న వంతెన పనులు చేస్తున్న క్రమంలో రెండు క్రేన్ల మధ్య చిక్కుకుని చనిపోయాడని కంపెనీ ప్రతినిధులు మృతుడి భార్య పోశవ్వకు సెల్‌ఫోన్ ద్వారా మంగళవారం సమాచారం అందించారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోధిస్తున్నారు. భారత ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేలా చర్యలు తీసుకోవడంతో పాటు తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

మృతుడికి భార్య పోశవ్వ, వివాహమైన కూతురు భాగ్యలక్ష్మీ ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య కోరారు.


చంద్రయ్య(ఫైల్)

నేరెళ్లలో ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు

ధర్మపురి, జూన్ 18: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ బోనాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తి మీద బోనాలు పెట్టుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. అనంతరం మహిళలు, రైతులు ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు అమ్మ వారలకు పసుపు, కుంకుమ చల్లి, బోనాలు పెట్టి నైవేద్యం సమర్పించారు. కుటుంబ సభ్యులు క్షేమంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నేరెళ్ల మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు, న్యాయవాది జాజాల రమేష్, మాజీ ఉపసర్పంచ్ జాజాల శంకర్, ఉపాధ్యక్షులు పాదం చంద్రయ్య, జంగిలి తిరుపతి, కరవత్తుల నాగరాజు,జాజాల రవి ఉన్నారు.


గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ బోనాలు

మీసేవ కేంద్రాల ఆధ్వర్యంలో పౌరసేవల మహోత్సవం



మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసేందుకు వచ్చిన లబ్ధిదారులు

కరీంనగర్ రూరల్, జూన్18: మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేసి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్ రూరల్ మండలంలోని మీసేవ కేంద్రాల నిర్వాహకులు పౌరసేవల మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్రాలకు వచ్చిన వారికి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీ సేవ కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షుడు వేముల అశోక్ మాట్లాడుతూ మీసేవ కేంద్రాలను ఉమ్మడి రాష్ట్రంలో 2011 సంవత్సరంలో ప్రారంభం కాగా మొదటగా సుల్తానాబాద్ మండలం మీసేవ వ్యవస్థను ప్రారంభించారని తెలిపారు. మీసేవ కేంద్రాల ద్వారా 600రకాల పైగా సేవలను అందిస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్, మున్సిపల్, స్టాంపులు, రిజిస్ట్రేషన్, రెవన్యూ, సాంఘిక సంక్షేమ, ఇతర రకాల ప్రభుత్వ పథకాలతో పాటు ప్రజలకు మీసేవలను ప్రజలకు అందిస్తున్నామని మీ సేవ కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షుడు వేముల అశోక్ తెలిపారు. ప్రభుత్వం కూడా నూతన సర్వీసులు మీసేవ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబందిత మంత్రి శ్రీధర్ బాబును కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మీసేవ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

కరీంనగర్ కల్చరల్, జూన్ 18: నగరంలోని ఎల్ఐసీ భవన్‌లో మంగళవారం సిటీ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సీనియర్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వానమామలై శ్రీనివాసాచార్యులు, కల్యాణ్‌కుమార్, శ్రీపతి సదానందం ఎన్నికలను జరిపి నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. త్వరలో సభ్యులందరికి 3 లక్షల నుంచి 5 లక్షల వరకు ఇన్సూరెన్స్ కార్యక్రమాన్ని చేట్టనున్నట్లు వివరించారు. అధ్యక్ష ఉపాధ్యక్షులుగా పురుమ శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తోట శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శిగా కర్నె శ్రీహరి, కోశాధికారిగా అల్లం నగేశ్, సభ్యులుగా వి ప్రశాంత్, శ్రీకాంత్, శేఖర్‌చంద్ర, టి గణేశ్, వి పవన్‌కుమార్, కె సాయికిరణ్‌లు నియమితులయ్యారు.

సమాజ సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

భగత్‌నగర్, జూన్18: లయన్స్‌క్లబ్ ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు సాగుతుందని 320జి రెండవ ఉప గవర్నర్ లయన్‌మోర భద్రేశం అన్నారు. మంగళవారం రేకుర్తిలో లయన్స్‌క్లబ్ గోల్డెన్ శాతవాహన థర్డ్ ఇన్స్టాలేషన్ ప్రోగ్రాం ప్రమాణ స్వీకార కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా 214దేశాలలో విస్తరించి లయన్స్ లక్ష్యాలైన ఆకలిగొన్న వారిని ఆదుకోవడం, నేత్ర పరిరక్షణ, పర్యావరణం కాపాడటం, క్యాన్ అవగాహన యూత్ ఎంపవర్‌మెంట్ మహిళా సాధికారత, తదితర సామాజిక సేవా లక్ష్యాలతో ముందుకు పోతుందని అన్నారు.

●లయన్స్ క్లబ్ గోల్డెన్ శాతవాహన 2024-25 నూతన అధ్యక్షులుగా మానువాడ శంకర్, కార్యదర్శిగా ననువాల గిరిధర్‌రావు, కోశాధికారిగా డాక్టర్ కుంభోజు రమేష్ ఎన్నికయ్యారు. నూతన కమిటీలో పాశం నరసింహరెడ్డి, చిలుఊరి రాములు, మమతవేణు, బండారి గంగాధర్, ఏదులరాజశేఖర్, అక్కినపల్లి అజయ్‌కుమార్, ఎ శ్రీనివాస్, బీప్రవీణ్‌కుమార్, టిరాజేశ్వర్‌రావు, ఎన్.హరిప్రియ, ఎం కిషోర్‌గౌడ్, ఎం.వనజ, ఎ.లక్ష్మి, జ్యోతి, సమత, దేవయ్య సత్య వెంకట స్వామి, సంతోష్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వేలేటి శ్రీనివాస్ రావు, లయన్‌గాలిపెల్లి వెంకట్, పవనసుతరాజు పాల్గొన్నారు.

ఏసీటీవోలకు గెజిటెడ్ హోదా కల్పించాలి

హుజూరాబాద్, జూన్ 18: వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఏసీటీవోలకు గెజిటెడ్ హోదా కల్పించాలని టీసీటీఎస్టీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గెజిటెడ్ హోదాపై రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీకి వినతిపత్రం సమర్పించామన్నారు. ఏసీటీవోలకు గెజిటెడ్ హోదా ఇచ్చినట్లయితే ప్రభుత్వ ఖజానాపై ఎటువంటి భారం పడదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏసీటీవోలకు గెజిటెడ్ హోదా 216 జీవో ద్వారా అమలు చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఏసీటీవోలకు గెజిటెడ్ హోదా కల్పించి న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారిలకు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ నాయకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

హుజూరాబాద్, జూన్ 18: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మున్సిపల్ కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఆధారాలు లేని నిందలు వేస్తూ, పరుష పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారన్నారు. కౌశిక్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హోటళ్లలో మున్సిపల్ అధికారుల తనిఖీలు

హుజూరాబాద్, జూన్ 18: హుజూరాబాద్ పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలను మున్సిపల్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటళ్లలో తయారీకి వాడుతున్న ముడి సరుకులు, వాడే నూనెను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు కిషన్‌రావు, వినయ్, అనిల్, సుధీర్, రవీందర్‌రెడ్డి, వలిపాషా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేత

జమ్మికుంట, జూన్ 18: జమ్మికుంట రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ కేంద్ర జలశక్తి, రైల్వే సహాయక మంత్రి సోమన్నకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల బస్సులు తనిఖీ చేయాలి



ఎంవీఐకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హుజూరాబాద్, జూన్ 18: హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంవీఐ కంచె వేణుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బస్సులు రవాణాశాఖ నిబంధనలు పాటించడం లేదన్నారు. బస్సులలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారన్నారు. డ్రైవర్ల లైసెన్స్‌లను తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని బస్సులను గుర్తించి వాటిని సీజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాము, రోహిత్, రాహుల్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సర్వం సిద్ధం

-కరీంనగర్ రూరల్ మండలంలో లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం



జ్యోతినగర్‌లోని నర్సరీ



నర్సరీలో మొక్కలకు నీరు పోస్తున్న సిబ్బంది

కరీంనగర్ రూరల్, జూన్18: గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఉపాధిహామీ పథకంలో ఈఏడాది కరీంనగర్ రూరల్ మండలంలో 17 గ్రామాలలో మొత్త 1,12,300 మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో బాగంగా ప్లాంటేషన్ విభాగంలో 53,900 మొక్కలు, ఇంటింటికి మొక్కల కింద 58,400, ఉద్యానవన శాఖలో 50ఎకరాల్లో మొక్కలు నాటుతారు. అయితే ఇప్పటికే జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఇటీవల ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని చామనపల్లిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎనిమిది విడతలుగా తెలంగాణకు హరిత హారం పేరుతో కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారం స్థానంలో వనమహోత్సవం పేరిట కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఉపాధి హామి పథకంలో ఉపాధి కూలీల ద్వారా మొక్కలు నాటేందుకు చెరువులు, కుంటలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టారు. మొదటగా స్థలాలను గుర్తించి ఉపాధి హామీ కూలీలతో గుంతలు తవ్వి మొక్కలు నాటుతారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

మొత్తం 17గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో లక్ష్యానికి అదనంగా 1.80లక్షల మొక్కలు పెంచుతున్నారు. ఒక్కొక్క గ్రామానికి అవసరమైన లక్ష్యాన్ని అధికారులు కేటాయించారు. ప్లాంటేషన్ కింద 53,900 మొక్కలను రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణలు తదితర ప్రాంతాలు గుర్తించి ఆయా ప్రాంతాల్లో నాటేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు ప్రణాళిక కూడా రూపొందించారు. అదేవిధంగా గ్రామంలోని ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించారు. ప్రతి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా మొక్కలు నాటేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. మొత్తం 58,400 మొక్కల్లో ప్రధానంగా పండ్లు, పూల మొక్కలు గ్రామస్థులకు పంపిణీ చేస్తారు.

లక్ష మొక్కలు టార్గెట్
-ఉపాధి హామీ ఏపీవో శోభారాణి



కరీంనగర్ రూరల్ మండలంలో మొత్తం 17 గ్రామాలకు ప్రతి గ్రామంలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగింది. మొత్తం లక్ష్యం 1,12,300 మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వనమహోత్సంలో భాగంగా పంచాయతీల్లో మొక్కలను పెంచుతున్నాం. గ్రామాల్లో స్థలాలను ఎంపిక చేసి మొక్కలు నాటేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేయడమే కాకుండా, ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, చెరువులు, కుంటలు, రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటించడం జరుగుతుంది.

గాండ్ల కులస్తులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

కరీంనగర్ టౌన్/సుభాష్‌నగర్, జూన్ 18: రాష్ట్ర ప్రభుత్వం గాండ్ల కులస్తులకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని గాండ్ల (తిలకుల)సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్, ప్రధాన కార్యదర్శి జక్కం పుల్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గానుగ ద్వారా నువ్వులు, పల్లీలు ఇతర నూనేలను తీస్తూ కుటుంబాలను పోషించుకునేవాళ్లమని తెలిపారు. ప్రస్తుత కాలంలో పెద్ద పెద్ద ఆయిల్ మిల్లులు మార్కెట్‌లోకి రావడంతో తామంతా ఉపాధి కోల్పోయామన్నారు. గానుగతో నూనే తీసి అమ్ముకునే పరిస్థితి లేక, కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేదని వాపోయారు.

ప్రస్తుతం చాలామంది కూలి పనులు చేసుకుంటున్నారని, మరికొందరు ఇతర రాష్ట్రాలకు కూలికి వెళ్లారని తెలిపారు. పిల్లలకు చదువులు చెప్పించలేక చదువులు మాన్పించాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

23న పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జూన్ 18: నగరంలోని ముఖరంపుర వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 10-30 గంటలకు తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి, సంపాదకులు, గ్రంధకర్త అయిన ఆచార్య అనుమాండ్ల భూమయ్యచే వెలువరించిన 'కరీంనగర్ కవులు-నాడు-నేడు' పుస్తక ఆవిష్కరణను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కొత్త అనిల్‌కుమార్, దొమ్మాటి శంకర్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

ముఖ్య అతిథిగా పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, అతిథులుగా సాహితీవేత్త డాక్టర్ సంగనభట్ల నరసయ్య హాజరౌతారని పేర్కొన్నారు. సాహితీ వేత్తలు డాక్టర్ మలయశ్రీ, డాక్టర్ నలిమెల భాస్కర్, వారాల ఆనంద్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావులకు ఆత్మీయ సత్కారాలు చేయనున్నట్లు తెలిపారు. కవితలు ప్రచురింపబడిన వారికి పుస్తకాలు వేదిక వద్దే అందజేస్తామని తెలిపారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి, ఎమ్మెల్యేలకు రాజ్యాంగ పుస్తకాలు అందజేత

కరీంనగర్ అర్బన్, జూన్ 18: రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏఐసీసీ పిలుపు మేరకు మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పడాల రాహుల్ భారత రాజ్యాంగ పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ తమకు 400 స్థానాలు వస్తే భారత రాజ్యాంగ వ్యవస్థను మారుస్తామని ఇచ్చిన పిలుపుకు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఇచ్చిన సందేశానికి ప్రజలు స్పందించారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి 400 స్థానాలు రాకుండా ప్రతికూలంగా ఓటు వేసి భవిష్యత్తులో రాజ్యాంగాన్ని మార్చాలనే సాహసం చేయకుండా రాజ్యాంగాన్ని కాపాడిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయాన్ని అనుసరించి బుధవారం రాహుల్ గాంధీ పుట్టిన రోజున భారత రాజ్యాంగ ప్రతులతో ముద్రించిన పుస్తకాలు పంపిణీ చేస్తామని పడాల రాహుల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అట్లా అనిల్ ముదిరాజ్, అనురాగ్ దసారావు, ప్రధాన కార్యదర్శి కిం ఫహద్, జిల్లా కార్యదర్శి జవ శ్రవణ్‌రెడ్డి, మాజీ యువజన కాంగ్రెస్ కార్యదర్శి అర్జున్ గౌతమ్, గట్టు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో ఎండుతున్న నారుమడులు

-ట్యాంకర్లతో నీరు పడుతున్నరైతులు



మొగ్దుంపూర్‌లో ట్యాంకర్‌తో నారు మడికి నీరు పెడుతున్న రైతు

కరీంనగర్ రూరల్, జూన్18: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నారుమడులను రక్షించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో రైతులకు చేగుర్తి ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరాను అందిస్తున్నారు. రెండు రోజుల కిందట కురిసిన గాలి వానకు విద్యుత్ స్తంభం కేబుల్ వైరుపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో పలువురు రైతులకు చెందిన నారుమడులు నీళ్ళు లేక ఎండి పోయే పరిస్థితి నెలకొంది.

దీంతో నారుమడులకు ఎలాగైనా నీరందించాలని మంగళవారం గ్రామానికి చెందిన మంద అశోక్ అనే రైతు వాటర్ ట్యాంక్‌తో నీళ్ళు పట్టాడు. 2వేల రూపాయలు చెల్లించి నీటిని కొనుగోలు చేసే పరిస్థితి నెలకొందని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోయారు. విద్యుత్ స్తంభాలను సరిచేసే విధంగా చర్యలు చేపడు తామని అధికారులు తెలిపారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి



కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి



శంకరపట్నంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, జూన్18: నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో మానకొండూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని రోడ్లు, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నూతనంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులకు 60కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని సూచించారు.

● ఎల్ఎండి కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 73మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

● శంకరపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం శంకరపట్నం మండలం ఎంపీడీవో కార్యాలయంలో 29మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వం ప్రజాభీష్టం మేరకు పరిపాలన కొనసాగుతుందన్నారు. అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అనంతరం తాడికల్‌లో నిర్వహించే ఎల్లమ్మ జాతరలో పాల్గొని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో శ్రీవాణి, పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బిజిగిరిషరీఫ్‌లో ఘనంగా సందల్ ఉత్సవం



భక్తులతో కిటకిటలాడుతున్న దర్గా ప్రాంతం





చాదర్లు సమర్పిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి , కాంగ్రెస్ నాయకుడు వొడితల ప్రణవ్

జమ్మికుంట రూరల్, జూన్ 18: జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ గ్రామంలోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహమతుల్లాహ అలై దర్గా సందల్ (గ్రంథలేపనం) ఉత్సవం ఘణంగా నిర్వహించారు. సోమవారం రాత్రి 11గంటలకు ప్రారంభమైన కార్యక్రమం మంగళవారం తెల్లవారు జాము వరకు కొనసాగాయి. మొల్లపల్లి, పెద్ద బిజిగిరిషరీఫ్ గ్రామాల నుంచి అత్యంతభక్తి శ్రద్ధలతో మేళతాళాలు, అల్లాహ్ కీర్తనల మధ్య సందల్‌ను తీసుకు వచ్చి దర్గాలోని సమాదులకు అలంకరింపచేసి, చాదర్లు సమర్పించారు. ఈ సందర్భంగా మత గురువు మౌలాన యాసీన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆనంతరం భక్తులు క్యూలైన్లో నిలబడి దర్గా దర్శనం చేసుకోని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి ముస్లీం సోదరులు పెద్ద ఎత్తున తరలిరావడంతో దర్గా ప్రాంతం కిక్కిరిసి పోయింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంఛార్జ్ వొడితల ప్రణవ్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, హుజూరాబాద్ ఏసిపి శ్రీనివాస్‌జీ, పట్టణ సీఐ వరంగంటి రవిలు వేర్వేరుగా సమాదులకు చాదర్లు సమర్పించారు. కార్యక్రమంలో దర్గా ముతావలి మహమ్మద్ అక్బర్ అలీ, అధ్యక్షులు మొహమ్మద్ ఇక్బాల్, ఉపాధ్యాక్షులు మొహమ్మద్ అబ్దుల్ కరీం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవులు మృతి

కరీంనగర్ రూరల్, జూన్18: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామ శివారులోని మానేరు వాగులో విద్యుదాఘాతంతో నాలుగు ఆవులు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కోరుకంటి సత్యనారాయణకు చెందిన నాలుగు ఆవులను మేత కోసం మానేరు తీరానికి తరలించాడు. మానేరు వాగులో గ్రామానికి చెందిన కాల్వ శ్రీనివాస్ అనే వ్యక్తికి చెందిన వ్యక్తి మానేరు వాగులో వ్యవసాయ మోటారును ఏర్పాటు చేసుకున్నాడు. ఆ మోటారుకు బిగించిన విద్యుత్ వైర్లు తేలి ఉండటంతోనే దాహం కోసం మానేరు వాగులో నీరు తాగుతుండగా అక్కడికక్కడే ఆవులు మృతి చెందాయని యజమాని కోరుకంటి సత్యనారాయణ తెలిపారు. అక్రమంగా మానేరు వాగులో మోటారు ఏర్పాటు చేయడం వల్ల తమ ఆవులు మృతి చెందాయని బాధితుడు కన్నీరు మున్నీరయ్యాడు. ఈ ఆవుల్లో రెండు పాలిచ్చేవని, మరో రెండు సుడి ఆవులు ఉన్నాయని తెలిపారు. వీటి విలువ 3లక్షల 20వేల రూపాయల ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 18: రాష్ట్రంలోని వివిద క్రీడా అకాడమిలలో ప్రశాలకు ఎంపికకై 2024-25 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి బి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈనెల 24, 25 తేదీలలో అకాడమిలలో ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ వెలోడ్రమ్‌లో సైక్లింగ్, రెజ్లింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నారని తెలిపారు. హన్మకొండలోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ఎంపికకు డీఎస్‌ఏ హన్మకొండలో, ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమిలో ప్రవేశానికి డీఎస్‌ఏ హన్మకొండలో ఎంపికలను నిర్వహిస్తారని తెలిపారు. వనపర్తిలో నిర్వహించే హాకీ అకాడమిలో ప్రవేశాలకు డీఎస్‌ఏ వనపర్తిలో, సరూర్‌నగర్, రాజన్నసిరిసిల్లలో నిర్వహిస్తున్న వాలీబాల్ అకాడమిలలో ప్రవేశాలకు ఎంపికలను సరూర్‌నగర్ వాలీబాల్ అకాడమిలో నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనుటకు ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థులు జనన ధృవీకరణ పత్రంతో ఈనెల 24, 25 తేదీలలో సంబంధిత అకాడమిలలో రిపోర్టు చేయాలని ఆయన సూచించారు.

ఏఎస్ఐ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

కరీంనగర్ క్రైం, జూన్ 18: కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ కిషన్ ఇటీవల గుండెపోటుతో మరణించగా పోలీసుశాఖ భద్రత పథకం నుంచి మంజూరైన ఎక్స్‌గ్రేషియా మొత్తం ఎనిమిది లక్షల రూపాయల చెక్‌ను మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులకు కరీంనగర్ అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు.

హోంగార్డుకు వెల్ఫేర్ ఫండ్ చెక్ అందజేత

కరీంనగర్ క్రైం, జూన్ 18: హుజూరాబాద్ పోలీసు ఠాణాలో విధులు నిర్వహిస్తున్న సంపత్ అనే హోంగార్డ్ జనవరి నెలలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. శస్త్రచికిత్స అనంతరం ఇటీవలే కోలుకున్నాడు. కోలుకున్న సంపత్‌కు మంగళవారం అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా హోమ్ గార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి పదివేల రూపాయల చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. హోమ్ గార్డ్స్ రజనీకాంత్ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నేటితో అధ్యయనోత్సవాలు ముగింపు

కరీంనగర్ కల్చరల్, జూన్ 18: కరీంనగర్‌లోని జ్యోతీనగర్ లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. సోమవారం ప్రారంభమైన అధ్యయనోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. మంగళవారం శ్రీవైష్ణవ ద్విజులు ద్రవిడ ప్రబంధ పారాయణం చేశారు. కాగా ఈ నెల 26 నుంచి జూలై 1వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. అధ్యయనోత్సవాల్లో ప్రధానార్చకుడు దీవి కృష్ణకిషోర్, వైదికులతో పాటు ఆలయ కమిటీ బాధ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

గోపాల్‌రావుపేటలో పోలీసుల పహారా

రామడుగు, జూన్ 18: మండలంలోని గోపాల్‌రావుపేటలో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ తీవ్ర దుమారం లేపగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గ్రామంలో పహారా కాస్తు న్నారు. రెండు కులాల మధ్య చిచ్చు రగిలి చిలికి, చిలికి గాలి వానలా మారింది. పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. అయితే ఇది పంచాయతీ పెద్దల సమక్షంలో తేల్చుకోవాలని భావించినా అది చివరికి ఘర్షణకు దారి తీసింది. అధికారులు చర్యలు తీసుకుని ఇప్పటికైనా పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అన్నారంలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు

మానకొండూర్, జూన్ 18 : మండలంలోని అన్నారం గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. గౌడ సంఘం మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో బోనాలను పెట్టి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. ఎల్లమ్మ ఆలయ కమిటి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మానకొండూర్, జూన్ 18 : మండలంలోని వివిద గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. 73 మంది లబ్దిదారులకు గాను రూ. 73లక్షల 8వేల 468ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజు, మండల అధ్యక్షులు నందగిరి రవాంద్రాచారి, కాంగ్రెస్ నాయకులు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, గసిగంటి సంపత్, కొత్తకొండ శంకర్, జడల రమేశ్, లబ్దిదారులు ఉన్నారు.

సంక్షేమ పథకాల నమోదుకు అవకాశం కల్పించాలి

శంకరపట్నం, జూన్ 18: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీలకు అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల నమోదుకు, సవరణకు అవకాశం కల్పించాలని శంకరపట్నం మండల బీజేపీ నాయకులు అన్నారు. ఆన్‌లైన్‌లో మరొకమారు అర్హులైన లబ్ధిదారుల వివరా లు నమోదు చేయుటకు అవకాశం కల్పించాలని, ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని శంకరపట్నం మండల ఎంపీడీ వో శ్రీవాణికి బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పిం చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాసమల్ల శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన అంకుషావలి చెరువు

జమ్మికుంట రూరల్, జూన్ 18: జమ్మికుంట మండ లం తనుగుల గ్రామ అంకుషావలి చెరువు కట్ట గత ఏడాది కోతకు గురైంది. చెరువు నిండితే తనుగుల, గండ్రపల్లి, శంభునపల్లి, పాపక్కపల్లి, గోపాల్‌పూర్, వావిలాల గ్రామాల రైతులకు చెందిన 800ఎకరాల పంట పొలాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. చెరువు కట్టకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతు న్నారు.